
# ఇల్లాలు

చెల్లూరి సీతారాజేశ్వరరావు



నవల తీసుకుని కుర్చీలో కూర్చున్నానో లేదో బయట వాన ప్రారంభించింది. విసుగ్గా లేచాను. పెరట్లో ఆరవేసిన బట్టలు తీసి లోపల పడవేశాను. వాన క్రమేపీ ఎక్కువయింది. జల్లు పడుతుండటం వల్ల కిటికీలు మూసివేశాను. సాయంత్రం నాలుగున్నర గంట

లయింది. కాని ముసురుకి అర్ధ రాత్రిలా వుంది. డ్రాయరుమీది నవల తీసుకుని సోఫాలో కూర్చు న్నాను. ఈ ముసురుకి కరంటు పోదుకదా?

నాకు అనుమానాలు ఎక్కువ.

ఎనిమిదయింది. నవల పూర్త యింది. కరంటు అదృష్టంకొద్దీ పోలేదు. వాన వుధృతంనుంచి చిరుజల్లులలోకి దిగింది.

నాన్న యింకారాలేదు. వెయిట్ చేద్దామంటే ఆకలి ఆగనంటోంది. వంటింట్లోకి పోయి వడ్డన ప్రారం భించాను.

వీధితలుపు చప్పుడయింది.

నాన్న గొడుగువున్నా కొద్దిగా తడిశారు. టవల్ యిచ్చి, "సినిమాకి వెళ్ళారనుకుంటున్నాను" అన్నాను.

"వెళదామనే బయలుదేరాను. ఆ త్రాష్టుడు కనిపించాడు." నాన్న బాత్ రూంలోకి దారితీశారు.

నాన్నకికూడా వడ్డించాను. నాన్న రావడానికి పావుగంటకు పైగా పట్టింది. నాకు అసహనంగా వుంది- విస్తరిముందు తపస్సు చెయ్య డానికి.

"మీ అమ్మ రాలేదుకదూ?" యిస్త్రీలుంగీ చుట్టుకుని వచ్చారు.

"వెళ్ళింది పుట్టింటికి కదా!" నవ్వుతూ అన్నాను.

నాన్నీపూట ఆవకాయ కలుపు కోలేదు. వడియాలు ముట్టుకోలేదు. కొద్దిగా అన్నం వడ్డించుకుని సాంబారు పోసుకున్నారు.

"ఆకలి లేదేమిటి?"

"చెప్పానుకదమ్మా-ఆ త్రాష్టుడు కనిపించాడని. ఇదివరకు ముఖా వంగా తప్పుకుపోయేవాడు. ఇవాళ 'మావయ్యా' అంటూ దగ్గరకి వచ్చాడు. హోటల్‌కి లాక్కు పోయాడు. అవియివీ తినిపించే శాడు. వాడి వేషాలు నా దగ్గరా?"

ఆ త్రాష్టుడు రాజేంద్రని అర్థమై పోయింది. నాన్నకి మేనల్లుడు. రెండిళ్ళమధ్య పదేళ్ళనుంచి రాక పోకలులేవు.

"వాడు సర్పంచ్ అయ్యాడట. ఏదో ఘనకార్యం క్రింద చెబు తున్నాడు. పల్లెటూరి గబ్బిలాయం" అన్నారు కోపంగా.

పదేళ్ళయినా నాన్న కోపం పోయినట్లులేదు. మావయ్యపోయిన ఏడాదికి, "జయంతి నీకోడలు అక్కా!" అన్నారు నాన్న వెళ్ళి.

"నా యిష్టమేముందిరా? వాడిని అడుగు. వాడికిష్టమైతే అలాగే చేద్దాం" అంది అత్తయ్య. అత్తయ్య బోళామనిషి. ఆవిడేం రాజకీయం నడపలేదు.

నాన్న రాజేంద్రని అడిగారు.

"ఇంకా నాకు యిరవైయేళ్ళు రాలేదు. అప్పుడే పెళ్ళేమిటి మావయ్యా! ప్రస్తుతం నేను పెళ్ళి చేసుకోను."

"తర్వాత చేసుకుందువు కదా! పోనీ జయంతి అంటే యిష్టమేనా?"

"నీ కూతురేమయినా రంభా-వూర్వశా- ఎగిరి గంతెయ్యడానికి? జయంతి ఒక సాధారణమైన ఆడపిల్ల-ఆమెతండ్రి ఒక గుమస్తా మానవుడు."వ్యంగ్యంగా నవ్వాడు.

రాజేంద్ర యస్సెల్సీ తప్పినా పదెకరాల పొలముంది.పల్లెటూరిలో డాబావుంది. ఏకైక సంతానం. ఆ ఆశతో నాన్న మేనల్లుడేకదాని అడిగారు.

"ఒరేయ్! నీకు కట్నం యివ్వనని భయంవద్దు. నాకున్నది ఒక్కతే ఆడపిల్ల. ఎంతకావాలో చెప్పు?"

"ఆ విషయం నేను పెళ్ళి చేసుకునేముందు చెబుతాను."

సంబంధం చేసుకోలేదని నాన్న రాకపోకలు మానివేశారు. నేను అప్పటిదాకా కాలేజీలో చేరతానంటే నాన్న, అమ్మకూడా ఒప్పుకునేవారు కాదు. పెళ్ళి రద్దవడంతో నాన్న నన్ను కాలేజీలో జేర్పించారు.

"నీ కిష్టమొచ్చేదాకా చదువుకోమ్మా! ఆ పల్లెటూరి గబ్బిలానికి బుద్ధయినా వస్తుంది. వాడ్నిమించిన సంబంధం తీసుకువస్తాను" అన్నారు నాన్న.

డిగ్రీ పూర్తవడంతో నే బ్యాంక్‌లో వుద్యోగం వచ్చింది నాకు.

భోజనాలయ్యాక యిద్దరం వీధి వరండాలో కూర్చున్నాం. వానతగ్గి కొద్దిగా వెన్నెల పడుతోంది. ట్రాన్సిస్టర్‌లో సన్నగా నాదస్వరం వినిపిస్తోంది.

"అసలు భోజనానికి యిక్కడికే వస్తానన్నాడు. మీ అమ్మ లేదని చెప్పేశాను. దానికి వాడు సిగ్గు లేకుండా 'మరోరోజు వస్తాలే మావయ్యా!' అన్నాడు..అమ్మాయ్! వాడివరస చూస్తుంటే మన సంబంధం కోసం ఎగబడుతున్నట్లు తోస్తోంది. వాడి పోకిరీవేషాలకి ఎవరూ పిల్లనిచ్చినట్లు లేదు." అక్కసుగా అన్నారు.

"ఇంతకీ ఏం చేస్తున్నాడు?" యధాలాపంగా అడిగాను.

నాన్న సిగరెట్ వెలిగించి కుర్చీలో వెనక్కి వాలారు. "అడగడం మరచి పోయానమ్మాయ్! అయినా అడిగేందుకేముంది? వాడి వరుస చూస్తుంటే అర్థంకాలేదా? మోటారుసైకిలూ....555 సిగరెట్టు పెట్టీ. వాళ్ళ నాన్న యిచ్చింది

(మిగతా కథ 89 వ పేజీలో)

(ఇల్లాలు.... 16 వ పేజీ తరువాయి)

యిలాగే షోకులకి తగలేసి వుంటాడు."

తన శత్రువు పైకి రాలేదన్న మూర్ఖ - మనస్తత్వమే నాన్నది. రాజేంద్ర తనమాట కాదన్నాడు. అందుకని అతడు పైకిరాడు, యింకా పతనమైపోతాడు. అరగంట మాటల్లో తేలిన సారాంశం యిది.

"మనకెందుకులే నాన్నా!" నిద్రపోడానికి లేచాను.

మర్నాడు సోమవారం-ఇక పని కంగారు.. తొమ్మిదింటికే భోజనం చేసి నాన్న ఆఫీసుకి. నేను బ్యాంక్‌కి వెళ్ళిపోయాం.

మధ్యాహ్నం నాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ వచ్చింది హైద్రాబాద్‌కి. ఇది నేను ఎదురుచూస్తున్నదే కాబట్టి విస్మయపడలేదు.

ఆనందం అధికమయ్యింది-ఫల్గుణ దగ్గరగా వెళుతున్నందుకు.

"నీకు త్వరలో - ట్రాన్స్‌ఫర్ అయ్యేలా చేస్తాను చూడు"-అన్నాడు ఫల్గుణ ఆరు నెలల్క్రితం ట్రాన్స్‌ఫర్ అయి వెళుతూ.

మాట నిలబెట్టుకున్నాడు.

ఇక వుత్తరాల పనిలేదు. కలల ద్వారా సంబర పడనక్కర్లేదు. వాస్తవంగా అనుభవంగా తెలుసుకోవచ్చు.

. సాయంత్రం నేను యింటికి పోయేసరికి అమ్మ వచ్చివున్నది. టిఫిన్ చేస్తోంది. నేను బట్టలు మార్చుకునేసరికి నాన్న వచ్చారు.

షేవింగ్ సెట్ తీసుకుని వసారా గుమ్మంలో కూర్చున్నారు.

"అసు" సంధ్యవేళ యిదేం వేళం? పొద్దున్నప్పుడు చేసుకోరాదూ?" అమ్మ విసుగ్గా అరచింది.

"పొద్దుట తొందరలో పరాకు పడిపోయాను. మా పిపోయిన గడ్డంతో యివాళ ఎన్ని అవమానాలు పడ్డానని. ఇంతకీ పుట్టింటివారి రవేమిటి? మీనాటకాం అన్నయ్య ఏం చేస్తున్నాడు? ఇంటి దగ్గర వున్నాడా- సంచారంలో వున్నాడా?"

"కోతల బావగార్ని ఓసారి రమ్మన్నాడు- కాలక్షేపం కావడం లేదుట."

అమ్మ రిపోర్టులో తీసిపోయినది కాదు. వాళ్ళ గొడవలో వాళ్ళు వుండగా నా ట్రాన్స్‌ఫర్ వార్త చెప్పేశాను.

"అంతదూరమా? వీల్లేదు" అంది అమ్మ.

"ట్రాన్స్‌ఫరా!" నాన్న విరాకు పడ్డారు.

"ఊళ్ళో వుద్యోగంకదాని ఒప్పుకున్నాను. ట్రాన్స్‌ఫర్ అగక

పోతే మానేసెయ్. మరేం ఫర్వా లేదు. పెళ్ళి చేసుకుని అత్తవారింటికి వెళ్ళేదానివి, ఇప్పటికే పెళ్ళి ఆలస్యమయింది." అమ్మ కోపంగా అన్నది.

ఫల్గుణ విషయం యింట్లో చెప్పలేక ట్రాన్స్‌ఫర్ కోరుకున్నాను. ఇంటర్ కాస్టు మ్యారేజీని అభ్యుదయమనుకోరు వాయిలు. కొన్నాళ్ళు దూరంగా వుంటే, నామీద బెంగవల్ల పెళ్ళికి అంగీకరించవచ్చు ననుకున్నాను. మొదటికే మోసం వచ్చేలా వుంది.

అమ్మ కోపంగా నాన్నకేసి తిరిగింది. "చేసిందంతా చాలు. నాన్న చెప్పలేని పనిలేదు. చదువో అంటూ యింతదాకా తెచ్చారు. అప్పుడే ఓ సంబంధం చూసి ముడి పెట్టేసే ఈ గోల వుండునా?"

నేను అక్కణ్ణుంచి తప్పుకున్నాను.

నాన్న టిఫిన్ చేసి బయటికి వెళ్ళిపోయారు. పేపరు చూస్తున్నట్లు నటిస్తూ కుర్చీలో కూర్చున్నాను. మనస్సంతా సమస్యామయం వుంది.

అమ్మ గట్టిగా చెబితే నాన్న కూడా 'మానెయ్ వుద్యోగం' అనగలరు. ఎలామరి?

రాజేంద్ర జ్ఞాపకం వచ్చాడు.

రాత్రి నాన్న భోజనమయ్యాక, పక్కా పొడి యిచ్చే నెపంమీద ఆయన దగ్గరికెళ్ళి, "ఇప్పుడు వుద్యోగం మానేస్తే రాజేంద్రకి లోకువైపోమూ?" అన్నాను.

నాన్న ఆలోచనలో పడ్డట్టు ఆయన ముఖమే చెబుతోంది. డబ్బు కోసం చేయించడంలేదు వుద్యోగం నాన్న. "నీకంటె మా అమ్మాయ్ నయం ఆ రోజున. కాదన్నందుకు చూడు"-ఏదో రోజున రాజేంద్రనని వెయ్యడానికి. మరో కారణం-వుద్యోగం చేస్తుంటే కట్నాలబాధ కాస్తయిన తగ్గుతుందని.

"అదీ నిజమేననుకో. కానీ రాదేకదా పెళ్ళి పోతే. అమ్మాయి మనకి తెలుసున్న వాళ్ళున్నారు. రేపే వుత్తరం రాస్తాను." నాన్న రాజీపడిపోయారు.

రెండు రోజులు గడిచాయి. నాన్న బలపరచడంవల్ల అమ్మ అయిష్టంగా అంగీకరించింది- నా ప్రయాణానికి.

మధ్యాహ్నం రెండు గంటలు. సాయంత్రంఎక్స్‌ప్రెస్‌కి ప్రయాణం. సిద్ధం చేసుకుంటున్నాను. బయట మోటారుసైకిల్ ఆగింది. కిటికీలో నుంచి చూశాను.

రాజేంద్ర!

తలుపుతీసి పలకరింపుగా నవ్వి, "రా" అన్నాను. రాజేంద్ర కుర్చీలో

కూర్చుని, "అత్తయ్య లేదా ఏమిటి?" అనడిగాడు.

"పడుకుంది- లేపుతాను."

"వద్దు వుంటాలే. ఇవాళే వెళుతున్నావా?"

నేను విస్మయపడ్డాను. రోజూ వచ్చేవాడిలా అడుగుతాడేమిటి? నేను అతడ్ని చూసి పదేళ్ళయినా అయివుంటుంది. మాట్లాడకుండా తలూపాను.

"హైద్రాబాదు తరచు వస్తూంటాలే నేను."

"కాఫీ పెడతానాగు."

"వద్దు. యిప్పుడే పెళ్ళిభోజనం [illegible]. నాకు మజ్జిగ [illegible] చాలు. భోజ్జు ఎక్కువ తినడంతో దాహం పట్టుకుంది."

రాజేంద్ర మజ్జిగ త్రాగుతూండగా నాన్నగారు వచ్చారు. నేను తిరిగి నా పనిలో చొరబడ్డాను: అపరిచితులతో ఎక్కువసేపు మాట్లాడలేను. హాల్లోంచి వారిమాటలు వినిపిస్తూనే వున్నాయి.

"ఈయేడు జయంతికి పెళ్ళి చేసేస్తాం. రెండు సంబంధాలు రెడీగావున్నాయి. ఒకతను యం.డి. కట్నం వద్దంటున్నాడు. రెండో సంబంధం మా ఆఫీసరుగారి అబ్బాయి. అమెరికాలో చదువుకుంటున్నాడు. ఇవాళో రేపో వచ్చేస్తాడు." నాన్న అంటున్నారు.

"అయితే నాకు పెళ్ళిభోజనం తగిలించవన్నమాట!"

"రత్నం కూడా గుడ్డివాడికి బొమ్మరాయిలా కనిపిస్తుంది. అది వాడి కర్మ. ఇంతకీ మీ నాన్న యిచ్చినఆస్తి గంటవాయించేసావా?"

"నీ దయవల్ల లేదులే. మా నాన్న యిచ్చిన పదెకరాలు ఇరవై అయింది. [illegible]మందులదుకాణం. కొవ్వొత్తుల తయారీ పెట్టాను. త్వరలో టూరింగ్ టాకీసు ఓపెన్ అవుతుంది. నిన్ను పిలుస్తాలే మేడ గృహప్రవేశానికి."

"గట్టివా[illegible] క్షేమం లేదుమరి.

రాజేంద్ర గంట కూర్చుని లేచాడు. "జయంతీ! ఒకసారి మా ఊరురండి- రిలీఫ్‌గా వుంటుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"వాడి మాటలన్నీ కోతలే నమ్మకు! వీడి ముఖానికి అంత రాత కూడానా? నిజం కూపీ లాగనూ నేను?" అన్నారు నాన్న ఉక్రోషంగా.

"మనకెందుకు నాన్నా?"

సాయంత్రం ప్రయాణం. నాన్న బస్‌స్టాండ్‌కి వచ్చారు. బస్సు బయలుదేరేదాకా జాగ్రత్తలు చెబుతూనే వున్నారు.

ఏడుగంటలు హైద్రాబాద్ పయనం. ఇది ఫల్గుణతో ఏడడుగుల సంబంధానికా అనిపిస్తోంది నాకు.

* * *

ఆరునెలలు గడిచాయి.

స్నేహితురాలు పెళ్ళికి ముమ్మిడివరం వెళ్ళాను. భోజనాలు కాగానే బయలుదేరినా మూడుగంటలకి కాని బస్సు దొరకలేదు. రేవుదాటి కోటిపల్లె వచ్చేసరికి సాయంత్రం అయిదు గంటలయింది. తిరిగి బస్సుకోసం నిరీక్షణ. చీకటిపడినా బస్సు అయిపులేదు. ప్రయాణీకుల సంఖ్య పెరుగుతోంది.

తల భారంగా వుండటంవల్ల కాకాహోటల్లో టీ బలవంతంగా నోట్లో పోసుకున్నాను. ఏడుగంట అయింది. ఓ బస్సు వచ్చింది. జనం ఈగల్లా ముసిరేశారు.

"ఈ బస్ వెళ్ళదండీ-రిపేర్." డ్రయివరు సెలవిచ్చాడు.

అందరూనిరాశ పడికూలబడ్డారు. పల్లె మూగబోతోంది. గోదావరి మీదనుంచి చలిగాలివీస్తోంది.

దగ్గరని యిలా రావడం ఎంత పొరపాటు చేశాననిపించింది. ఎనిమిదయ్యాక బస్సువచ్చింది. బలమున్నవారు ఎక్కారు. నాలాంటి వారు మిగిలిపోయారు.

మరోబస్సు వస్తుందని ఎవరో జోస్యం చెబుతున్నారు. ఇంతలో ఓ టాక్సీ వచ్చింది. నలుగురు ఆడవాళ్ళం దానిమీద బయలుదేరాం. పది మైళ్ళురాగానే టాక్సీ ఆగిపోయింది. డ్రయివర్ బాగుచేతలోకి దిగాడు.

"థర్టీ ట్రావెల్స్!" ఎదురుగా వున్న షోడా కొట్టు బెంచీ మీద కూర్చున్నాను-తొమ్మిదిన్నరయింది. సినిమా జనంతో రోడ్డు నిండుగా వుంది.

జీవితంలో అప్పుడప్పుడు విస్మయపడే విషయాలు జరుగుతూంటాయి. నాకు రాజేంద్ర కనిపించడం అలాంటిదే.

"ఇక్కడున్నావేమిటి?" నేనే తేరుకుని అడిగాను.

అతడు నవ్వాడు- "బాగుంది. మా వూరు వచ్చి నన్నే అడుగుతున్నావన్న మాట!"

"సారీ!"

"నీ ప్రశ్నకే నువ్వే సమాధానం చెప్పేయ్- ఇది నీ వంతు."

క్లుప్తంగా చెప్పాను.

"మా వూరుమీదనుంచి పోతూ యిక్కడ దిగకపోతే భగవంతుడు ఒప్పుకుంటాడా? పద-యింటికి పోదాం. సూట్ కేస్ వుందా? అమ్మ యాత్రల కెళ్ళింది, వచ్చేస్తుంది రేపో మాపో."

నేను మోహమాటం పడ్డాను. రాజేంద్ర అంగీకరించలేదు. టాక్సీలోనుంచి సూట్ కేస్ తీశాడు. నాతోటి ప్రయాణీకులకి టాటా చెప్పి అతడ్ని అనుసరించాను.

మెయిన్ రోడ్ దిగి వార్డులోకి నడిచాను. వీధి దీపాలు అక్కడక్కడ మాత్రం వెలుగుతున్నాయి. పల్లె మూగనోము నోస్తోంది. ఇరుకైన సందుదాటి చెరువు గట్టు మీదకి వచ్చాం. గుడ్డివెన్నెలలో ఆ నిశ్శబ్దంలో నడవడం థ్రిల్లింగ్‌గా వుంది నాకు.

శివాలయం ప్రక్కగానే రాజేంద్ర యిలు. అరుగుమీద ట్యూబ్‌లైట్ వెలుగుతోంది. ఇద్దరు పాలేర్లు రాజేంద్రని చూచి లేచారు. ఒకడు పెట్టె అందుకున్నాడు.

"నాగన్నా! నీళ్ళపొయ్యి అంటించరా—అమ్మగారు స్నానంచేస్తారు. పంతులుగారి బళ్ళోడ్ని కేకెయ్యి. చుట్టాలు వచ్చార్ని చెప్పు- వంట సంగతి చూస్తుంది."

"నేను భోంచెయ్యను. మధ్యాహ్నం పెళ్ళి భోజనంతో బరువుగా వుంది. దార్లో ఎన్నిషోడాలు త్రాగానో!" ఇంటోకి రాగానే అన్నాను.

"పెరుగుతోనైనా కలిపి [illegible]

"ప్లీజ్!"

"సరే. బోర్నవిటా త్రాగు. హాయిగా పడుకుంటే నిద్రపోరాదూ?"

స్నానంచేసి బట్టలు మార్చుకోగానే చిరాకు తగ్గింది. రాజేంద్ర బోర్నవిటా తీసుకువచ్చి "ఎదర గదిలో ప్రక్క వేయించాను" అన్నాడు.

"నా గురించి నీకు శ్రమాయె!" నొచ్చుకుంటూ అన్నాను.

"మేం శ్రమజీవులంకదా.... టాటా ... రాత్రి నీ నిద్ర పాడు చెయ్యడం నా అభిమతం కాదు. ప్రొద్దుట మాట్లాడుకుందాం." రాజేంద్ర వెళ్ళిపోయాడు.

శయ్య ఎక్కగానే కళ్ళుమూసుకున్నాయి. ఎండ పెళ్ళుమంటుండగా మెలకువ వచ్చింది. అలారం ఎనిమిదింబావు చూపిస్తోంది. దిగ్గున లేచాను. అపరిచితమైన యింట్లో తడుముకుంటూ పెరటివైపుకి వచ్చాను. రాజేంద్ర స్టౌమీద కాఫీ పెడుతున్నాడు.

"ఎలకలు-దోమలు, నిన్ను నిద్రపోనిచ్చాయా?" రాజేంద్ర అడిగాడు.

తలూపి ముఖం కడుక్కుని వచ్చాను. "నేను పెడతాలే కాఫీ."

"ఎందుకూ? అయిపోయింది. అతిథిచేత పనులు చేయిస్తామా?"

"వంటకూడా నువ్వే లాగించేస్తావా?"

"చెయ్యగలను కానీ నీకు సమస్య కావచ్చు. ఇండైజేషన్ అందుకే వంటమనిషిని రమ్మన్నాను. అదిగో వెయ్యేళ్ళాయుష్షు- వచ్చేసింది."

వెనక్కి తిరిగాను. యాభై యేళ్ళ ముసలమ్మ- నడ్డి వంగిపోయింది.

"కనకమ్మా! ముందర టిఫెన్ చెయ్యాలి." రాజేంద్ర పురమాయించాడు.

నేను స్నానం చేసేసరికి తొమ్మిదయింది. కనకమ్మ పెసరట్టు ఉప్మా తెచ్చింది హాల్లోకి. టిఫెన్ బాగుంది కూడా.

"అయితే యిపుడు మీ నాన్న చూసిన సంబంధాల్లో ఏదో ఒకటి చేసుకుంటావన్న మాట!"

చురుగ్గా చూశాను. "పూర్వం నాకో ఉద్దేశం లేదా?"

"కరెక్ట్! ఫల్గుణ కోసమే కదా హైద్రాబాదు పోయావు."

నేను మాట్లాడలేకపోయాను. నా అంతరంగిక విషయం యితడికెలా తెలిసింది? ఎవరు చెప్పారు? చర్చించబుద్ధికాలేదు నాకు.

"ఫల్గుణ బ్యాంక్ సొమ్ము దుర్వినియోగం చేశాడు. పీకల మీదకి వచ్చి, నలభై వేలు నిన్నడిగాడు. నీ దగ్గర లేదు. వాళ్ళ మేనమామ కుంటి కూతుర్ని ఎరపెట్టి డబ్బిచ్చాడు. ఫల్గుణ పెళ్ళికొడుకయ్యాడు."

నేను తినడం ఆపి, "ఎలా తెలిసాయివన్నీ నీకు?" అడిగాను.

"నీకు తెలియనివి నాకు చాల తెలుసు. ఫల్గుణ దూరమయ్యాడని నీకు బాధలేదు. అతడి క్యారెక్టర్ లూజ్ అని తెలియగానే, నీ ధోరణి మార్చుకున్నావు. ఫల్గుణమీద నీకు అభిమానం స్థిరంగా వుంటే నలభై వేలు నేనే యిచ్చేవాణ్ణి."

"మధ్యన నీకెందుకు?"

"మొదట్నుంచీ నీకోసం పాటుపడ్డాను కాబట్టి."

"వాట్!"

రాజేంద్ర కోసం జీపులో నలుగురైదుగురు వచ్చారు. 'భోజనానికి వస్తాను' అని వాళ్ళతో వెళ్ళిపోయాడు. వీక్లీ చదువుతున్నా దృష్టి నిలపడ లేదు. నా కోసం చేశానంటున్నాడు రాజేంద్ర. ఏం చేశాడు? అంతా మిస్టరీలాగుంది.

రాజేంద్ర తిరిగి వచ్చేసరికి ఒంటిగంటన్నరయింది. అప్పటిదాకా ఏదో నవల చదువుతూ కూర్చున్నాను. వంట మనిషి యిద్దరికీ వడ్డించింది.

నాకు ఆకలికంటే అశాంతిగా వుంది- పొద్దుట రాజేంద్ర అన్న మాటల పై. అడుగుదామను

కున్నాను. రాజేంద్ర చాల అలసటగా కనిపించాడు.

"మూడింటికి వెళ్ళిపోతున్నాను" అన్నాను మెల్లగా.

రాజేంద్ర తలఎత్తాడు. "నిన్ను తోటకి తీసుకు వెళదామనుకుంటున్నాను. మళ్ళీ మళ్ళీ ఇస్తావేమిటి?"

మూడింటికి టీ త్రాగి బయలుదేరాం. ఇంటికి ఎడంవైపుగా కొత్త మేడ తయారవుతోంది రంగులు వేస్తున్నారు. "ఇల్లు చూద్దుగాని రా" అన్నాడు రాజేంద్ర.

"తర్వాత."

ఓ మైలుదూరంలో వుంది తోట. రాజేంద్ర కొబ్బరిబోండాలు తీయించాడు. తోటంతా తిరిగాక ఎత్తు దిబ్బమీద కూర్చున్నాం. దూరంగా దిగువనున్న ఆకుపచ్చటి చేలు కన్నులపండుగగా కనిపిస్తున్నాయి.

ఎలా అడగాలా అని ఆలోచిస్తున్నాను.

"నీ కోసం నేను ఏదో చేశానన్నడం నీకు ఆశ్చర్యంగా వుంది కదూ? ఇది నీకు అబద్ధమనిపిస్తోంది. అవునా?" రాజేంద్ర అడిగాడు.

నేను మాట్లాడలేదు.

"నువ్వు స్కూలు ఫైనలు చదువుతూండగా ఒకసారి మా వూరు వచ్చావు. కాలేజీలో చదివి తర్వాత వుద్యోగం చేస్తానన్నావు. అందుకే మామయ్య పెళ్ళికి అడిగినా తిరస్కరించాను. ఆ కసితో నిన్ను చదివించాడు. నీ వుద్యోగం కూడా అప్లికేషన్ పెడితే రాలేదు. అయినా వేరే నేను చదివించాను. నీ ట్రాన్స్‌ఫర్ విషయం ఫలించలేదు. ఏం చెయ్యలేకపోతే నేనే సాయం పట్టాను. ఇదంతా నీకు ఎందుకు తెలియజేయలేదంటావా? ఒకరి సాయం స్వీకరించవని."

"నా మీద నీకెందుకు యింట్రస్టు?"

రాజేంద్ర నవ్వాడు. "కొన్ని ప్రశ్నలకి జవాబులు మాటల్లో దొరకవు- మనసుతో వెతుక్కోవాలి."

నా మనసంతా గజిబిజిగా వుంది. రాజేంద్ర బొమ్మ రకరకాలకోణాల్లో కనిపిస్తోంది. ఇదేనా నా జీవన శిల్పి?

చీకటి పడుతుండగా యింటికి వచ్చాం. రాజేంద్ర మేడచూపిస్తానన్నాడు. తలపోటుగా వుందని వచ్చి పడుకున్నాను. ఏదిమార్గం? ఏది రాజమార్గం?

ఉద్యోగినిగా-అక్కడవుదయం లేచి యింటి చాకిరీ చేసుకుని ఆఫీసుకి పరుగెత్తడం, సాయంత్రం అలసటగా యింటికి వచ్చి, తిరిగి యింటిపని. రెండు మెతుకులు తిన్న

వెంటనే వెర్రినిద్ర. ఆలోచించే వ్యవధి కూడా లేను. అది స్వాతంత్ర్యం కాదు- బానిసత్వం. స్వేచ్ఛనే చక్కెర పూతపూసుకొని విషాన్ని మింగుతున్నాం. నిన్న నేడు రేపు- ఒకటే, మార్పు ఏమీ వుండదు.

ఆలోచనలతో నిద్ర పట్టేసింది. అయిదు గంటలకి కోడికూతతో మెలకువ వచ్చింది. తలుపు తీసి అరుగుమీదకి వచ్చాను.

నిదురించిన పల్లె మేలుకుంటోంది. ఉషోదయం కన్నుల పండుగగా వుంది. దేవళంలోని గంటలు స్పందనంగా వున్నాయి.

రాజేంద్ర దగ్గరకి వచ్చాడు. "అప్పుడే లేచావేం? రాత్రి భోజనానికి ఎంత పిలిచినా పలకలేదు."

"నిద్ర పట్టేసింది."

మరో గంటలో ప్రయాణమయ్యాను. నేను కాఫీ త్రాగుతూండగా, "మా క్రొత్త యిల్లు చూడవా ఏమిటి?" రాజేంద్ర వచ్చాడు.

"చూడాలని లేదు."

విస్మయంగా చూశాడు. "నీకు యిక్కడ ఏదయినా కష్టం కలిగితే క్షమించు జయంతీ! నువ్వు చూడకుండా వెళితే నాకు శాంతి వుండదు."

పాలేరు సూట్‌కేస్‌తో ముందుకి నడిచాడు. నేను గుమ్మాలు దిగాను. రాజేంద్ర అశాంతిగా నన్ను అనుసరిస్తున్నాడు. అతడి దగ్గరగా నడిచి, "గృహప్రవేశానికి జంటగా చూద్దాం. ఇంటికి దీపం యిల్లాలే కదా!" మెల్లగా అన్నాను.

"జయంతీ!"

"నా కోసం శ్రమపడే వాడివి దాటి పోతానా! పెళ్ళి నీ కిష్టమేనా? నేనేం రంభా ఊర్వశీ కాను సరి!" కొంటెగా నవ్వుతూ అన్నాను.

"అంతకంటె ఎక్కువ." రాజేంద్ర నన్ను దగ్గరకి తీసుకున్నాడు.

"అగు మరీ—యిది రోడ్డు."

మేం యిద్దరం జంటగా రావడం చూసి అమ్మా, నాన్న తెల్లబోయారు.

Published by K. Rajendra Babu; 80- Dhanalaxmi Colony, Madras- 600 026 and Printed by Vijaya Bapineedu at Vijaya Graphics; 210- Arcot Road, Madras- 600 026. Phone: 422233

Editor : VIJAYA BAPINEEDU